మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట

# కిడ్నీ బాధితులకు సర్కార్ భరోసా

- జిల్లా దవాఖానల్లోనే డయాలసిస్ సేవలు
- తగ్గిన వ్యయప్రయాసలు
- మహబూబ్‌నగర్‌లో 60 మంది రోగులు
- ఉమ్మడి జిల్లాలో 450కి పైగా బాధితులు
- బాధితులకు పింఛన్ కల్పించడంతో హర్షం

**డయాలసిస్ బాధితులకు సర్కార్ ఆపన్న హస్తం అందిస్తున్నది. రెండు కిడ్నీలు పాడైపోయి రక్తశుద్ధి చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న బాధితులకు భరోసా కల్పిస్తున్నది. 2014కు ముందు హైదరాబాద్, కర్నూల్ లాంటి ఇతర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునే పరిస్థితి ఉండేది. బాధితులు వెళ్లలేక,వ్యయ ప్రయాసాలకు ఓర్చి తీరా అంతదూరం వెళ్లినా పేర్ల నమోదులో అక్కడ ఏమైనా ఇబ్బంది ఏర్పడితే నానా అవస్థలు పడేవారు. పేదల ఇబ్బందులు కష్టాలను గుర్తించిన సీఎం కేసీఆర్ స్వరాష్ట్రంలో కిడ్నీ రోగులకు సర్కార్ డయాలసిస్‌సేవలు ప్రారంభించారు. జిల్లా దవాఖానల్లోనూ సేవలు ప్రారంభించడంతో ఎక్కడి వారికి అక్కడే వైద్య సేవలు అందుతుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.**



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మార్చి5, ప్రభాతవార్త:** మూత్రపిండాలు సరిగా పనిచేయకపోవడంతో వైద్యులు వాటిని యంత్రాల ద్వారా పని చేసేలా చేస్తారు. 80శాతానికి పైబడి కిడ్నీలు తమ విధిని సక్రమంగానే నిర్వహిస్తాయి. అంతకుమించి పని చేయకపోతేనే తర్వాత క్రమంగా పని చేయడానికి మొండికేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే కిడ్నీ పనిచేయకపోవడం, కిడ్నీ ఫెయిల్యూర్ అయినప్పుడే డయాలసిస్ సేవలు ఉపయోగపడ్తాయి.డయాలసిస్‌తప్ప వేరేప్రత్యామ్నాయ మార్గం ఉండదు.

**నాలుగు షిఫ్టుల్లో:** మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానలో మూడు, నాలుగు షిఫ్టుల్లో డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఆరు మిషన్లతో నిరంతరంగా రక్తశుద్ధి జరుపుతున్నట్లు జిల్లా జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ రాంకిషన్ తెలిపారు. ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. బాధితులకుకేటాయించిన తేదీల్లో వారంలో మూడుసార్లు వైద్య సేవలు, అవసరమైనన మందులు, ఇంజె క్షన్లు అందజేస్తున్నారు. పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా దవాఖానలో అన్నిరకాల వైద్య సేవలు అందిస్తు న్నట్లురాంకిషన్ తెలిపారు. అత్యంత ఖరీదైన మోకీలు మార్పిడి శస్త్రచికిత్సను కూడా విజయవంతంగా చేస్తున్నట్లు వివరించారు. తగ్గిన దూరభారం ఇబ్బందులు గతంలో డయాలసిస్ చేయించుకోవాలంటే హైదరాబాద్, కర్నూల్ లాంటి ప్రాంతాలకు వెళ్లేవారు. అక్కడికి వెళ్లి పేర్లు నమోదు చేసుకుంటే మరుసటి రోజు, రెండు రోజులలకుగానీ సేవలు అందేవి కావు. రెండు కిడ్నీలు పాడైన వారి ఇబ్బందులు అంతాఇంతా కావు. కానీ స్వరాష్ట్రంలో పేదలకు ఆరోగ్య భరోసా కల్పిస్తూ రక్తశుద్ధి కేంద్రాలను ప్రారంభించింది. ఉమ్మడి జిల్లాలో ఐదు కేంద్రాల్లో డయాలసిస్ సేవలు ప్రారంభించడంతో రోగులకు వ్యయప్రయాసలు తగ్గాయి. ఉమ్మడి జిల్లాలో 450కి పైగా కిడ్నీ బాధితులు ఉన్నట్లు అధికారుల లెక్కల ద్వారా తెలుస్తున్నది. డయాలసిస్ బాధితులకు సర్కార్ పింఛన్ అందిస్తుండడంతో రోగులకు మరింత మేలు చేకూరనున్నది.



మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖానలో చికిత్స పొందుతున్న డయాలసిస్ బాధితులు

**ఉమ్మడి జిల్లాలో బాధితుల వివరాలు..**

| జిల్లా | పడకలు | బాధితులు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 6 | 58 |
| నాగర్‌కర్నూల్ | 5 | 62 |
| జోగుళాంబ గద్వాల | 9 | 124 |
| నారాయణపేట | 5 | 44 |
| వనపర్తి | 10 | 124 |

**ఇప్పుడు చాలా సొలత్ ఉన్నది..**



మాది పెద్దదర్పల్లి గ్రామం. నాకు కిడ్నీలు పాడైనయి. ఇంతకముందు పట్నం కర్నూల్ వెళ్లలేక చాలా ఇబ్బందులు పడ్డా. ఖర్చు కూడా ఎక్కువగా అయ్యేది. తెలంగాణ సర్కార్ వచ్చాక చాలా సొలత్ అయ్యింది. మహబూబ్‌నగర్ దవాఖానలో బాగా చేస్తున్నరు. నేను ప్రతి నెలా ఇక్కడికే వస్తాం. ఇక్కడ వైద్యులు కూడా చాలా బాగా చూస్తున్నారు.

**- పల్లెమోని వెంకన్న, కిడ్నీ బాధితుడు,పెద్దదర్పల్లి**

# టీపీయూఎస్ ఉద్యోగులకు అండగా ఉంటా..!

- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి



టీపీయూఎస్ జిల్లా కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 05 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు ఉద్యోగుల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి హాజరై టీపీయూఎస్ 2023 నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించి కొత్తగా నియమించిన నాగర్‌కర్నూల్ జిల్లా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి, టీపీయూఎస్ రాష్ట్ర వ్యవస్థపక అధ్యక్షులు గంధం రాములు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన జిల్లా అయిన నాగర్‌కర్నూల్‌లో నిరుద్యోగ యువ త కోసం త్వరలో జాబ్‌మేళా పెడుతామని,స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గౌరవ పరిశ్రమలశాఖ మంత్రి కేటీ ఆర్‌తో మాట్లాడి జిల్లా కేంద్రంలో నిర్వహిస్తానని, నూతన కంపెనీలు జిల్లాకు వచ్చే విధంగా కృషి చేస్తానన్నారు. ప్రైవేటు ఉద్యోగులకు, కార్మికులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా టీపీయూఎస్ అధ్య క్షులు వై.మూర్తి యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సాజీద్ అలీ, ప్రధాన కార్యదర్శి సూరి పరుశరాములు, ఉపాధ్య క్షులు సాంబ శివుడు, విష్ణుమూర్తి, శేఖర్‌గౌడ్, కార్యదర్శులు సి.నరేష్‌రెడ్డి, శ్రీపురం హరి, ఎండి.హసన్, శేఖర్, నందకుమార్, జాయింట్ సెక్రటరి బైరెడ్డి వెంకట్‌రెడ్డి, కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రాజవర్ధన్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు సి.తిరుపతయ్యయదవ్, శివశంకర్, సోషల్ మీడియా మహేష , చారకొండ సత్యం, కార్మిక విభాగం కావలి రాముడు, లీగల్ అడ్వయిజర్ పి.కృష్ణలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కల్పన భాస్కర్‌గౌడ్, జెడ్పీటీసీ శ్రీశైలం, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

# వాహనాల పన్ను బకాయి ఉంటే రెట్టింపు జరిమానా!

- జిల్లాలో రూ.50కోట్ల బకాయిలు వసూలుపై రవాణా అధికారుల ప్రత్యేక నిఘా
- ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం జరిమానాలు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 05 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా 20 మండలాల్లో 1,20,548 వాహనాలు ఉన్నాయి. అందులో ద్విచక్ర వాహనాలు 75.018, కార్లు 7857, గూడ్స్ వాహనాలు 5696, ఆటో రిక్షాలు 4733, గూడ్స్ ఆటో రిక్షాలు 1149, వ్యవసాయ రంగానికి ఉపయోగించే ట్రాక్టర్లు 7155, కమర్షియల్ పరంగా ఉపయోగించే ట్రాక్టర్లు 5447, స్కూల్ బస్సులు 306 మరియు వివిధ రకాల వాహనాలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి.జిల్లా వ్యాప్తంగా 20 మండలాల వారిగా 5949 వాహనాల యజమానులు తమ రవాణా వాహనాలకు సంబంధించిన పన్నులు చెల్లించకుండా రోడ్లపై తిప్పుతు ప్రభుత్వ ఖాజానాకు రూ.50 కోట్లు చెల్లించకుండా గండికొడుతున్నారు. వాటిల్లో అధికంగా 1048లారీలు, ట్రాలీలు,స్కూల్ బస్సులు ఉన్నాయి.1293 ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఇప్పటికి పన్నులు చెల్లించకుండా వాహనాలు రోడ్డు రవాణా నిబంధనలను ఉల్లంగించి యధేచ్ఛగా రోడ్లపై సంచరిస్తున్నాయి. గత కొన్ని మాసాలుగా స్పెషల్ డ్రైవ్‌లో 100 వాహనాలను సీజ్ చేసి 30లక్షల రూ॥లను వాహనదారల నుంచి ప్రభుత్వ ఖాజానాకు చెల్లించామని రవాణా శాఖ అధికారి ఎర్రి స్వామి తెలిపారు. వాహనాల వారీగా ట్యాక్స్ పెండింగ్ జాబితాను జిల్లా అధికారులు రూపొందించారు. వాహనదారులు తమకు తాము ట్యాక్సీ నేరుగా కడితే వారికి డబ్బులు ఆదా అవుతాయని, తనిఖీల్లో పట్టుబడితే 200 శాతం అదికంగా ట్యాక్స్‌లు చెల్లించాల్సి ఉంటుందని వాహనదారులను అధికారులు హెచ్చరిస్తున్నారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారుల ఆదేశాల ఆదేశానుసారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

**ప్రత్యేక తనిఖీలకు సిద్ధం : జిల్లా రవాణా శాఖ అధికారి ఎర్రి స్వామి**



జిల్లాలో 5949 వాహన యజమానులు ప్రభుత్వానికి పన్ను బకాయిలు ఉన్నారు.పన్నులరూపంలో ప్రభుత్వానికి రూ.50 కోట్ల బకాయిలు వసూలు కావాల్సి ఉంది. ఈ వాహనాలపై చర్యలకు రవాణా శాఖ ఉపక్రమించింది. పన్ను బకాయి ఉన్న వాహనాలపై పోలీస్ శాఖ సహాయం తీసుకొని మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్‌ల ద్వారా తనిఖీలు నిర్వహిస్తాం. గత కొన్ని నెలల్లో 100వాహనాలపై కేసులు నమోదు చేసి రూ.30 లక్షలు వసూలు చేశాం. ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడితే వాహనాల యజమానులపై కేసులతో పాటు 200 శాతం జరిమానా విధించి పన్నులు వసూలు చేస్తాం.

# ఎన్నికల కోడ్ అమలులో ఉన్న తొలగించని ఫ్లెక్సీలు!

- ఫిర్యాదు చేసినా తొలగించని ఫ్లెక్సీలు



ఎన్నికల కోడ్ అమలులో ఉన్న తొలగించని బిఆర్ఎస్ ఫ్లెక్సీలు

**లింగాల,మార్చి 05 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి అధికార పార్టీకి అనుకూలంగా ఉంటూ ఫ్లెక్సీల తొలగింపుపై నిర్లక్ష్యం వహిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పూజారి వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు పూజారి వెంకటయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఫ్లెక్సీలు ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఫ్లెక్సీలు తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ నాయకులుఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. అధికార పార్టీకి అనుకూలంగా ఉంటూ బిఆర్ఎస్ నాయకుల ఫ్లెక్సీలు తొలగించకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఫ్లెక్సీలు తొలగిస్తున్నారని అన్నారు. ఫ్లెక్సీల తొలగింపుపై మండల కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఫ్లెక్సీల తొలగింపు విషయంలో పంచాయతీ కార్యదర్శి స్పందించకుంటే జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

# ఎండాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**వనపర్తి టౌన్,మార్చి 5 ప్రభాతవార్త:** నడివేసవి రాకముందే రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా యని, ప్రస్తుతం కొన్ని జిల్లాలో రోజు నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు గతేడాదికంటే రెండు డిగ్రీలు ఎక్కువగా ఉన్నా యని మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ జిల్లా ప్రజలకు తెలిపారు. మరికొన్ని జిల్లాలో ఒకటిన్నర నుంచి ఒక డిగ్రీ పైనే ఉంటున్నాయని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గతేడాది 4వ తేదీన 37.3 డిగ్రీలు నమోదు కాగా శనివారం 40 డిగ్రీల సెల్సియస్ నమోదైందని అన్నారు. ములుగు జిల్లాలోనూ 40 డిగ్రీలు నమోదైంది. రాత్రిపూట కూడాసాధారణ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అన్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్, భద్రాచాలంలో 21 డిగ్రీలఉ దాటాయని అన్నారు. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్నా యని, ఈఎండలకు బయటకు వెళితే వడదెబ్బ లేదా స్ట్రోక్‌బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నాయని ఇలాంటి పరిస్థితిలో మిమ్మల్ని మీరు ఆరోగ్యంగాఉంచుకోవాలంటే మాత్రంకొన్నిజాగ్రత్తలనుతప్పకుండా తీసుకోవాలనిఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారని ఆయన ప్రజలకు సూచించారు.

## గణపసముద్రం, బుద్దారం రిజర్వాయర్‌లకు..

# ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- గణప సముద్రానికి రూ.55కోట్లు, బుద్దారం రిజర్వాయర్‌కు రూ.42.2కోట్లతో పనులకు శ్రీకారం
- ఫలించిన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి కృషి



రిజర్వాయర్‌గా మారనున్న ఖిలాఘణపురం గణప సముద్రం



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,మార్చి 05 ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గంలోని గణప సముద్రం, బుద్దారం రిజర్వాయర్‌లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.97.2కోట్లు కేటాయిస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జల్లాఘణపురం మండల కేంద్రానికి చెందిన గణప సముద్రాన్ని కాకతీయులు 760 ఏళ్ల క్రితం నిర్మించారు.నియోజకవర్గంలో ప్రధాన రిజర్వాయర్ లుగా గణప సముద్రం, బుద్దారంరిజర్వాయర్‌ను మంజూరు చేయించడంలో వనపర్తి ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కృషి ఎంతో ఉందని చెప్పవచ్చు. 2రిజర్వాయర్ లకు సంబందించి ఆదివారం మంత్రి నిరంజన్ రెడ్డి ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు. గణప సముద్ర నిర్మాణాన్ని ఆదర్శంగా తీసుకోని వనపర్తి చుట్టూ సప్తసముద్రాలను వనపర్తి రాజులు నిర్మించారని తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ విలీనం తరువాత పాలకుల నిర్లక్ష్యంతో శిథిలావస్థకు చేరుకున్న గణప సముద్రం ఒకనాడు రైతులకు ఆసరాగా నిలిచిన సమైక్య రాష్ట్రంలో కనీసం మరమ్మత్తుకు కూడా నోచుకోలేదని ఆయన పేర్కొ న్నారు. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా ఉన్నప్పుడు తాను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి గణప సముద్రానికి మరమ్మత్తులు చేయించి కల్వకుర్తి ఎత్తిపోతలకు అనుసంధానం చేయడంతో 36ఏళ్ల తరు వాత కృష్ణా నది నీళ్లతో మండు వేసవిలో గణపసముద్రాన్ని అలుగుపారించడం జరిగిందని మంత్రి పేర్కొ న్నారు. గత 5ఏళ్లుగా గణప సముద్రం నిండు కుండలా ఉంటూ అలుగు పారుతుందని గణప సముద్రం రిజర్వాయర్ లో భూములు కోల్పోతున్న రైతులకు పరిష్కారం చెప్పడంతో పాటు దాదాపు 10వేల ఎకరాలకు సాగునీరు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తన ప్రకటనలో పేర్కొ న్నారు. ప్రకృతికి రమనీయంగా గణపసముద్రాన్ని తీర్చిదిద్దంతో పాటు 500ఏళ్ల వరకు బహు ళార్థ సాధకంగా ఉండ డమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చరిత్రలో నిలిచిపోయే విధం గా గణప సముద్రం పునరుద్దరణ పనులతో పాటు బుద్దారం రిజర్వాయర్ పనులు ఏకకాలంలో చేపట్టేలా ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల కానున్నాయని మంత్రి వివరించారు. ఈ రిజర్వాయర్ల నిర్మాణంలో పశుపక్షాదులు, చేపలకు శాశ్వల వనరులు ఏర్పడనున్నాయని అన్నారు. గట్టు కాడిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి గణపసముద్రం కిరీటంలా మకుటాయమానంలా నిలు స్తుందని అన్నారు. పనులు శరవేగంగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి రిజర్వాయర్లను తీసుకువస్తామని మంత్రి తన ప్రకటనలో పేర్కొన్నారు గణపసముద్రం, బుద్దారం రిజర్వాయర్లను ఆమోదిస్తు ప్రభుత్వం జీవో విడుదల చేసిన సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి సీఎం కేసీఆర్ కు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు.

# చిత్తనూరులో ఏర్పాటు చేస్తున్న కెమికల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి

- ఫ్యాక్టరీ ఎదుట వంటావార్పు నిర్వహించిన నిర్వాసితులు

**నారాయణపేట ప్రతినిధి,మార్చి 05 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూరు గ్రామంలో ఏర్పాటు చేస్తున్న విత్తనాల కెమికల్ ఫ్యాక్టరీని వెంటనే ఎత్తివేయాలని వివిధ గ్రామాలకు చెందిన నిర్వాసితులు పెద్ద ఎత్తున ఫ్యాక్టరీ ముందు వంటావార్పు నిర్వహించారు. అనేక ఇబ్బందులు తలెత్తుతాయని గత రెండు,మూడు నెలల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. వివరాల్లోకి వెళితే జూరాల ఆర్గానిక్ ఫార్మా ఇండస్ట్రియల్ వారు చిత్తనూరు శివారులో విత్తనాల కంపెనీ ఏర్పాటు చేస్తున్నారు. మూడు పంటలు పండే భూములలో ఈ కంపెనీ ఏర్పాటు చేయడాన్ని వివిధ గ్రామస్తులు వ్యతిరేకిస్తున్నారు. మోసపూరితంగా వాళ్ల అబద్దాలు చెప్పి చిత్తనూరు, జిన్నారం, ఎక్లాస్‌పూర్ గ్రామాలకు చాలా దగ్గరలో జనావాసాల మధశ్య ఈ కంపెనీ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. వారు తొలుత నేరేడు పండ్ల తోటలు పెడతామని చెప్పారని గ్రామస్తులు అంటున్నారు. కొద్ది రోజులలోనే విత్తనాల కంపెనీ నిర్మిస్తున్నారని నిజం బయటపడిందని అన్నారు. ఉత్పత్తి క్రమంలో ఏం జరుగుతుంది, యాజమాన్యానికి కలిగే ప్రయోజనం ఏంటని ప్రజలకు, ప్రకృతికి జరిగే నష్టాలేంటి వంటి ప్రశ్నలు మేధావులు వివధ గ్రామాల ప్రజలు లేవనెత్తుతున్నారు.గ్రామ యువ రైతాంగం ఈ ప్రశ్నలన్నింటికి సమాధానాలు వెతికే ప్రయత్నం చేసింది. మొత్తం మీదట విత్తనాల కంపెనీని వ్యతిరేకిస్తున్నామని కంపెనీని రద్దు చేసేంతవరకు తమ ప్రాణాలను పణంగా పెట్టి అయినా కంపెనీకి వ్యతిరేకంగా పోరాడుతామని వారు ముక్తకంఠంతో అంటున్నారు. వంటావార్పు కార్యక్రమంలో చిత్తనూరు, జిన్నారం, ఎక్లాస్‌పూర్ తదితర గ్రామాల రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వీరికి మద్దతుగా ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం వారు నిర్వహించి సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణకు సంబంధించి ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ఎలా అడ్డుకోవాలనే దానిపై ప్రత్యేకంగా చర్చ నిర్వహించారు.



వంటావార్పు నిర్వహిస్తున్న రైతులు



ఆందోళనలో పాల్గొన్న రైతులు

# సీపీఎస్ క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్

**గద్వాల ప్రతినిధి,మార్చి 05 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిచే తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గోడ క్యాలెండర్, టేబుల్ క్యాలెండర్‌లను ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లాఅధ్యక్షులు నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ పెన్షన్ ఇచ్చి ఎంతో మంది చనిపోయిన సిపిఎస్ ఉద్యోగ , ఉపాధ్యాయ కుటుంబాలకు న్యాయం చేసిందని అదేవిధంగా సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి 1,70000ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపాలని కోరారు. ఇప్పటికే 5 రాష్ట్రాలలో రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, పంజాబ్‌తో పాటు తాజాగా హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ నిర్ణయాలు తీసుకున్నాయి. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి కూడా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేసి దేశానికి మార్గదర్శకంగా నిలవాలని అదేవిధంగా ఒక లక్ష 70 వేల ఉద్యోగ ఉపాధ్యాయ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి తొందరగా నిర్ణయం తీసువాలని కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సిపిఎస్ ఉద్యోగుల సంఘం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి వన్నవాడ రమేష్‌కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు తహసిల్దార్ సుబ్రమణ్యం, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణు, టిఎన్‌జిఓ జిల్లా సెక్రెటరీ బిజాపూర్ ఆనంద్, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, సుజాత, జిల్లా సభ్యులు నరసింహ, ప్రతాప్‌రెడ్డి, ఈశ్వర్, లక్ష్మీనారాయణ, సూర్యప్రకాష్‌రెడ్డి, ఎల్లస్వామి, పరశురాం, అంజి, జహంగీర్, పుట్ట నాగరాజు, మండల బాధ్యులు గజేంద్రగౌడ్, రాజుసాగర్, దస్తగిరి, నాగరాజు, జీవన్, విశ్వనాథ్, సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

# 9న ఆంజనేయస్వామి పునప్రతిష్ట పూజలు ప్రారంభం



చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవస్థానం

**దేవరకద్ర,మార్చి 05 ప్రభాతవార్త:** జిల్లాలోని ప్రధాన దేవాలయాలలోని ఒకటైన దేవరకద్ర మండలం చిన్నరాజమూర్ శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారి పునప్రతిష్ట మహోత్సవ పూజలు ఈ నెల 9న ప్రారంభం కానున్నాయి. ఈ నెల 10వరకు ఈ పునప్రతిష్ట పూజలు జరుగనున్నాయి. దాదాపు రూ.40 లక్షల వ్యయంతో గర్భాలయనిర్మాణ పునర్నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో దేవస్థానం అభివృద్ధికి ఈ నిధులు మంజూరయ్యాయి. దీంతో స్వామివారి పునప్రతిష్ట పూజలకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. ఈ సందర్భంగా పునప్రతిష్ట పూజల మొదటిరోజు స్వామివారి సన్నిధిలో ప్రతిష్ఠాంపనాంగ మంటప స్థాపనం పూజలతో ఈ పూజలకు శ్రీకారం చుట్టనున్నారు. అలాగే పుణ్యాహవచనం,యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన,గణపతి నవగ్రహ పూజ,ప్రతిష్ఠాంపనాగ హోమాలు జరుగనున్నాయి. సాయంత్రం శ్రీశ్రీ 1008 శ్రీసత్యాత్మ తీర్థుల వారికి పూర్ణకుంభ స్వాగతం,ఆహ్వాహిత దేవతలకు ప్రదోశపూజ, అనుగ్రహసందేశం,మహామంగళమారతి కార్యక్రమాలను నిర్వహించనున్నారు.10న ప్రతిష్ఠాపన కార్యక్రమాలు,పంచామృతాభిషేకం,అలంకరణ నిర్వహిస్తారు.అలాగే సంస్థానపూజ,తీర్థప్రసాద వితవరణ, మహస్వాములవారిచే ఫలమంత్రక్షాతలు పూజలను నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వ్యవస్థాపక వంశీయులు రాఘవేంద్రాచారి,పరిమళాచారి,రామాచారి,భీమాచారి,హన్మేష్‌చారి తెలిపారు.

-పునప్రతిష్ట మహోత్సవాల తరువాత యధావిదిగా గర్భాలయంలో స్వామివారి పూజలు

దేవస్థానంలో ఆంజనేయస్వామి గర్భాలయనిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతుండటంతో స్వామి వారిని ప్రస్తుతం ఉన్న స్థలంలోనుండి తొలగించి దేవస్థానం ముందు కొత్తగా ఏర్పాటు చేసిన బాలాలయంలోకి స్వామివారిని తరలించారు. తాత్కాలికంగా ప్రస్తుతం స్వామివారు అక్కడనే భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థానం గర్భాలయనిర్మాణ పనులు పూర్తయ్యేవరకు ఇక్కడే స్వామి వారికి పూజలు చేశారు. అయితే పునప్రతిష్ట మహోత్సవాల తరువాత యధావిదిగా గర్భాలయంలోనే స్వామివారి పూజలు నిర్వహిస్తారు. స్వామివారు భక్తులకు అక్కడనే దర్శనమిస్తారు.

# శ్రీకోదండ రామాలయ నూతన కమిటీ ఎన్నిక

**లింగాల,మార్చి 05 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో సర్పంచ్ కోనేటి తిరుపతయ్య ఆధ్వర్యంలో ఆదివారం నూతన కమిటిన ఎన్నుకున్నారు. అధ్యక్షులు బళ్ళారి నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శి కంచరి మురళి, కందూరి శ్రీనివాసులు, కోశాధికారి బల్లారి రామరాజు, పూజారి భాస్కర్, గౌరవ అధ్యక్షులు మొగిలి మోహన్, కావేటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మాకం సుధాకర్, పూజారి బుడ్డయ్య కమిటి సభ్యులను ఎన్నుకున్నారు.

## తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షులుగా గొడుగు మహేష్ యాదవ్ నియామకం



**వంగూరు,మార్చి 05 ప్రభాతవార్త :** బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వంగూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గొడుగు మహేష్ యాదవ్‌ను బిసి విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. రాష్ట్రంలో బిసి సంక్షేమ వసతి గృహాలకు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని కార్పోరేట్ కళాశాలల దోపిడి విధానంపై రాజీ లేకుండా పోరాడుతామని అన్నారు. నా నియామకానికి సహకరించిన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్‌కు, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణకు, బిసి సంక్షేమ సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్‌కు, బిసి విద్యార్థి సంఘం కేంద్ర కమిటి అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్‌కు బడేసాబ్‌కు, అనిల్‌కు, దుడ్డు శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# మన్యంకొండలో తిరుచ్చిసేవపై ఊరేగిన వెంకటేశ్వరస్వామివారు

**-అలంకరణలో శ్రీదేవిభూదేవి సమేతంగా స్వామివారి దర్శనం**



స్వామివారికి మహామంగళహారతి ఇస్తున్న అళహరి మధుసూధన్‌కుమార్

**దేవరకద్ర,మార్చి 05 ప్రభాతవార్త:** జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ, కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసేవపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్ కుమార్,అళహరిరామకృష్ణ,ఈఓశ్రీనివాసరాజు,ప్రధాన పూజారులురాజేశ్,నరసింహ్మాయ్య, పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బందిసుదర్శన్,నారాయణరెడ్డి పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజా పోరాటం

**తెల్కపల్లి,మార్చి 05 ప్రభాతవార్త:**కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాన్ని నిర్వహిస్తామని నాగర్ కర్నూల్ జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్ అన్నా రు. ఆదివారం సిపిఎం తెల్కపల్లి మండల కమిటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం అవలంబిస్తున్న విధానాలను ఎండగడుతూ ఈనెల 23 నుండి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాతాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రధానమంత్రి నరెంద్రమోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు మోపుతూ పెట్రోల్,డీజిల్,వంటగ్యాస్ ధరలు నిరంతరం పెంచుతు న్నదని అన్నారు. ఈ విధానాలపై సిపిఎం పార్టీ నిరంతర పోరాటం నిర్వహి స్తున్నదని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు భాస్కర్, విజయ్‌గౌడ్, జగదీష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా బీజేపీ నిర్మాణానికి బలమైన పునాదులు వేయాలి

- ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాలు దేశాభివృద్ధి, రక్షణ రంగంలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజలకు వివరించాలి
- తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఇంచార్జీ అరవింద్ మీనన్



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఇంచార్జీ అరవింద్ మీనన్

**వనపర్తి టౌన్,మార్చి 05 ప్రభాతవార్త:** బూత్ సశక్తికరణ్ అభియాన్ ద్వారా పోలింగ్ బూత్ పరిది లోని కార్నర్ మీటింగ్‌లను నిర్వహించండని బీజేపీ జాతీయ కార్యదర్శి బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి అరవింద్ మీనన్ పేర్కొన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశం వనపర్తి జిల్లా కేంద్రంలోని లక్ష్మీకృష్ణ గార్డెన్‌లో పార్లమెంట్ కన్వీనర్ రాగి రామకృష్ణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్ మాట్లాడుతూ పార్లమెంట్ అసెంబ్లీ కోర్స్ సభ్యులుగా క్రియాశీలకంగా పని చేసేవారిని నియమించాలని పార్లమెంట్ కోర్ కమిటీ ప్రతి 15రోజులకు ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో అసెంబ్లీ కోర్ కమిటీ ప్రతివారానికి ఒక్కసారి ఒక మండల కేంద్రంలో సమావేశం జరిపి క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా పార్టీ నిర్మాణానికి బలమైన పునాదులు వేయాలని సూచించారు. పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రతి అసెంబ్లీలో 1వెయ్యి ఇండ్లకుపైన కమలం పువ్వు గుర్తుచ 6359119119 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి బీజేపీ కి మద్దతు తెలపండి అని వాల్‌రైటింగ్ చేయించాలని గ్రామాలు, మండలాలలో నాలుగు, ఐదు వందల మందిని ప్రభావితం చేసే ఓటర్లను గుర్తించి వారిని జిల్లా, రాష్ట్ర నాయకులకు పరిచయం చేసి నరేంద్రమోదీ సంక్షేమ పథకాలు, దేశాభివృద్ధి రక్షణ రంగంలో తీసుకుంటున్న చర్యలను వివరించి పార్టీ వైపు ఆకర్షికులు అయ్యే విధంగా ప్రతయ్నం చేయాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యాలను ప్రజాగోస బీజేపీ భరోసా శక్తికేంద్ర కార్నర్ మీటింగ్ ల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా పని చేశారని దానికి కొనసాగింపు



నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రవాస్ యోజన సమావేశానికి హాజరైన బీజేపీ శ్రేణులు

బూత్ స్వశక్తి అభియాన్ ద్వారా ప్రస్తుతం ఉన్న 22మందితో పూర్తి చేసిన పక్రియ బూత్ కమిటీలకు రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు అదనంగా 10మందిని జతపరిచి శక్తి కేంద్ర ఇంచార్జీ సహ ఇంచార్జీలతో పాటు స్వల్పకాలిక విస్తారక్(పూర్తి సమయకార్యకర్తను) నియమించాలని ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో కార్నర్ మీటింగ్ ను నిర్వహించాలని సూచించారు. అసెంబ్లీల వారిగా ధార్మికపరిషత్ మఠాల పీఠాధిపతి లను, ఆలయ కమిటీ, సాంస్కృతి సమితి సభ్యులతో తరుచుగా సమావేశాలు జరపాలని అయోధ్యలోని శ్రీరామచంద్రుని ఆలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ తీసుకున్న నిర్ణాయాలను, సాధించిన విజయాలను వివరించి రాష్ట్రంలో కూడా హిందూ దేవాలయాల ధార్మిక పరిషత్ లకు కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్ననిర్లక్ష్యాన్ని వివరించి బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, జాతీయ ఓబీసీ కమీషన్ మాజీ సభ్యులు తల్లూజు ఆచారి,జాతీయ ఖాదీ బోర్డు అధ్యక్షుడు పేరాల శేఖర్ జీ, బీజేపీ జాతీయ నాయకులు చింతా సంబమూర్తి, రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, మాజీ శాసన సభ్యులు రావుల రవీంద్రనాథ్ రెడ్డి, పార్లమెంట్ ప్రవారీ అట్లూరి రామకృష్ణ, కోకన్వీనర్ జింకల కృష్ణయ్య, వనపర్తి జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, గద్వాల జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి, వనపర్తి జిల్లా ఇంచార్జీ బోసుపల్లి ప్రతాప్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి, గడ్డం కృష్ణా రెడ్డి, అశ్వధామరెడ్డి, ఎం.శ్రీనివాస్‌రెడ్డి,దిలీప్ ఆచారి,సుబ్బారెడ్డి, జిల్లా ప్రదాన కార్యదర్శులు డి.నారాయణ ,కె.మాధవరెడ్డి,ఎ.రామన్‌గౌడ్,పార్లమెంట్ విస్తారక్ కేతూరి బుడ్డన్న, జిల్లా అధికార ప్రతినిధి పెద్దిరాజు, కార్యదర్శి బి.పరుశురామ్, కోశాధికారి బాశెట్టి శ్రీను, బచ్చురాము, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, కొల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్, అన్వేష్, దాసరాజు ప్రవీణ్, సూగూరు రాములు, రాయన్న, విజయసాగర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలే చేరికలకు మూలం..

- ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 05ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్ర అభివృద్ధి పనులను చూసి ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పర్చుకునేందుకు కారెక్కుతున్నారని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలానికి చెందిన బీజేపీ, బీజేవైఎం పార్టీ నాయకులు తమ బృందంతో కలిసి ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వారికి గులాభి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంబడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేస్తుందని, పేదలను అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి కులాల వారిగా అభివృద్ధి పరుస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని ఆయన పేర్కొన్నారు.ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి పర్చేందుకు ప్రత్యేక నిధులను ఏర్పాటు చేసి ఆ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. తాండలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి గిరిజనుల అభివృద్ధే లక్ష్యంగా నిధులను మంజూరు చేయడం విశేషమన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలోనే కాదు..భారతదేశంలో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో మేమందరం పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్సీ సమక్షంలో పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

**ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యం:** ప్రజల జీవన ప్రమాణాల పెంపే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తోందని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి మండలం జీడిపల్లి తాండకు చెందిన సునితకు రూ.16వేలు, తాండ్రకు చెందిన గోవర్ధనకు రూ.18వేలు, వెల్దండ మండలం ఎంజీ కాలనీ తాండకు చెందిన ఆర్.పంతులుకు రూ.50వేలు, మాడ్గుల మండలం ఈ.శివకు రూ.24వేలు, సువర్ణకు రూ.45,500లు, కడ్తాల్ మండలం ఏక్వాయిపల్లికి చెందిన శాంతకు రూ.16వేల చొప్పున మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబ సభ్యులకుతన నివాసంలో ఆదివారంబాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరప్రధాయినిగా నిలుస్తోందన్నారు. ప్రమాదాల్లో గాయపడ్డవారు, అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పోరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారన్నారు.కార్యక్రమంలో ఆయా మండలాల ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మన్యంకొండ శ్రీఅలివేలుమంగతాయారు ఉత్సవాలు ప్రారంభం

**-స్వర్ణాభరణ అలంకరణలో అమ్మవారు**
**-7న అమ్మవారి తిరుకళ్యాణమహోత్సవం, రాత్రికి విమానరథోత్సవం**



విద్యుత్‌బల్బుల అలంకరణలో అలివేలుమంగతాయారు దేవస్థానం

**దేవరకద్ర,మార్చి 05 ప్రభాతవార్త:** మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు బ్రహ్మోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏడాది గట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నెల రోజులుకు దిగువకొండ వద్ద కొలువుదీరిన అమ్మవారి ఉత్సవాలను ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ అమ్మవారి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంప్రదాయరీతిలో ఉత్సవాల మొదటిరోజు అమ్మవారి సన్నిధిలో అంకురార ్పణ పూజా కార్యక్రమాన్ని నిర్వహించి ఉత్సవాలకు శ్రీకార ంచుట్టారు.అలాగే పుణ్యాహవచనం, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. పురోహితుల వేధమం త్రాల మద్య ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**స్వర్ణాభరణ అలంకరణలో అమ్మవారు:** మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారిని ఆదివారం వివిద బంగారు అభరణాలతో స ్వర్ణాలంకరణ చేశారు. అలాగే వివిద రకాల పూలతో సర్వాంగ సుందరంగా శోభాయమానంగా అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దేవస్థానాన్ని రంగురంగుల విధ్యుత్‌బల్బులతో ముస్తాబు చేశారు.

**బ్రహ్మోత్సవ విశేషోత్సవాలు:** మన్యంకొండ శ్రీ అలివేలుమంగతాయారు బ్రహ్మోత్సవాలు ఈ నెల 9వరకు జరుగనున్నాయి. ఈ నెల 6న అమ్మవారి సన్నిధిలో ధ్వజారోహణం,7న తిరుకళ్యాణ మహోత్సవం,ఈ తిరుకళ్యాణమహోత్సవానికి జిల్లానుండేగాక వివిధ ప్రాంతాలనుండి భక్తులు మన్యంకొండకు భక్తులు అధికసంఖ్యలో తరలివస్తారు. ఈ సందర్భంగా ఆ రోజు దేవస్థానం ముందున్న కళ్యాణ మండపంలో అమ్మవారి తిరుకళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువలా నిర్వహిస్తారు. ఈ కార్యక్రవానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పిస్తారు. అలాగే అదే రోజు అమ్మవారి గరుధవాహనసేవ,రాత్రికి విమానతథోత్సవాన్ని నిర్వహిస్తారు. దేవస్థానం ముందు ఈ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 8న అశ్వవాహనసేవ,9న పూర్ణాహుతి, వసంతోత్సవం, అవబృతస్నానం,నాకబలి పూజలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలతో అమ్మవారి బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

# గ్రామ మత్స్య సహకార సంఘం అధ్యక్షునిగా తెలుగు కృష్ణ ఎన్నిక

**కెటిదొడ్డి,మార్చి 05 ప్రభాతవార్త :** మండల పరిధిలోని చింతకుంట గ్రామ పరిధిలోని చింతలకుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కమిటి నూతన అధ్యక్షునిగా తెలుగు కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మత్స్యశాఖ సీనియర్ ఇన్స్‌పెక్టర్ ఎం. రాజేంద్రప్రసాద్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. పాధ్యక్షులు తెలుగుచిన్న మల్లేష్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం డైరెక్టర్ సభ్యులుగా లక్ష్మయ్య, పెద్ద నరసింహులు, పెద్ద జంబయ్య, కృష్ణయ్య, చిన్న జంబయ్య, పెద్ద మల్లేష్, మునెప్ప, తిమ్మప్పలను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులు తెలుగు కృష్ణ మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అందరికి వర్తించేలా కృషి చేస్తానని అన్నారు.



మత్స్య సహకార సంఘం అధ్యక్షున్ని ఎన్నుకుంటున్న దృశ్యం

# ఆపదలో ఉన్న ప్రజలకు సీఎం సహాయనిధి అండగా నిలిచింది

● గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**ధరూర్,మార్చి 5 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ధరూర్ మండల పరిధిలోని వివిధ గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి అందజేశారు. రేవత భర్త వెంకటేష్‌కు రూ. 53 వేలు, మల్లారెడ్డి తండ్రి ఆశిరెడ్డికి రూ. 48 వేలు, నర్సమ్మ పెద్దకుర్వ తండ్రి ఉరుకుందుకు రూ. 44 వేలు, లక్ష్మి తండ్రి ఓబులేషుకు రూ. 39500లు, తిమ్మప్ప తండ్రి తిమ్మప్పకు రూ. 32 వేలు, నరసింహులు తండ్రి మహదేవకు రూ. 32 వేలు, ఎండి మగ్బూల్ తండ్రి ఎండి సోఫికి రూ. 30 వేలు, అంజనమ్మ భర్త మునెప్పకు రూ. 23 వేలు, పెద్ద రామన్న తండ్రి నర్సప్పకు రూ. 22 వేలు హనమంతు తండ్రి మహేష్‌కు రూ. 20 వేలు, పెద్ద రంగన్న తండ్రి సవారన్నకు రూ. 18వేలు, విజయభాస్కర్‌రెడ్డి తండ్రి చిన్న భీమన్నకు రూ. 16 వేలు, పెద్దమ్మ తండ్రి నారాయణకు రూ. 14 వేలు, రవి తండ్రి తాయన్నకు రూ. 13500లు, రాణి భర్త వెంకటన్నకు రూ. 11 వేలు, పల్లవి తండ్రి నరసింహులుకు రూ. 8 వేలు చొప్పున ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగకరమైన పేద ప్రజలు వైద్యఖర్చు కోసం పెట్టిన డబ్బులను సీఎం సహాయనిధి ద్వారా 50 శాతం డబ్బుల రూపంలో లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుంది. కరోనా కష్టసమయంలో కూడా పేద ప్రజలకు అండగా నిలిచిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం కెసిఆర్ అని పేర్కొన్నారు. ఆరోగ్య పరిస్థితి బాలేక ఆసుపత్రిలో ఖర్చుపెట్టిన వాటికి సంబంధించిన బిల్లులను సీఎం సహాయనిధి పంపితే సీఎం సహాయం కింద నమోదు చేసుకున్న వారికి లబ్ధిదారులకు సీఎం సహాయనిధి ద్వారా చెక్కుల అందజేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి నజీమున్నిసాబేగం, గట్టు ఎంఎ పి విజయ్, వైస్ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, ధరూర్ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి,గద్వాలటౌన్ పార్టీ అధ్యక్షుడు గోవిందు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, నాగన్న, అలీ, వెంకటేష్, ఈశ్వర్, షాకీర్ నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## రాజావలి దర్గా అభివృద్ధికి సహకరిస్తా

● తెలంగాణ రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప



రాజావలి దర్గాను సందర్శించిన దేవరి మల్లప్ప

**అమరచింత,మార్చి 05 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో వెలసిన హజ్రత్ సయ్యద్ షా రాజావలి దర్గా అభివృద్ధి కోసం తన వంతుగా పూర్తిగా సహకరిస్తానని తెలంగాణ రాష్ట్ర కార్పోరేషన్ మాజీ చైర్మెన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవరి మల్లప్ప పేర్కొన్నారు. ఆదివారం అమరచింత రాజావలి దర్గాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేసి దట్టి, పూలను సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. మహిమగల ఈ దర్గా అభివృద్ధి కోసం తన సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతానని హామీ ఇచ్చారు.మొదటగా దర్గా చుట్టుపక్కల కంపౌండ్ వాల్ నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు జరిగే ఉర్సు ఉత్సవాల్లో తాను మరోమారు దర్గాను సందర్శిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జామియా మసీద్, రాజావలి దర్గా నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్లికల్ తండా అభివృద్ధికి కృషి

-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



తండా వాసులతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

**కల్వకుర్తి, మార్చి 05 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం ఎల్లికల్ తాండలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పర్యటించారు. తండా వాసుల ఆహ్వానం మేరకు తండాలో పర్యటించి పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తండాకు విచ్చేసిన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని తండా వాసులు బాండు మేళ్యాలతో ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ ధ్వజస్తంభం, దేవాలయ సుందరీకరణ కోసం పెయింట్స్ వేయిస్తానని, తండాలో మంచినీటి వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్యం, ఉపాధి అనే నినాదంతో నియోజకవర్గంలో తమ వంతు అభివృద్ధికి తోడ్పాటు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఎల్లికల్ గ్రామ ఎంపీటీసీ సభ్యులు కల్లు నర్మద, మాజీ సర్పంచ్ నరసింహరెడ్డి, ఉప సర్పంచ్ బిచ్యానాయక్,తండావాసులు కిష్టనాయక్,చంద్రునాయక్, పాలాది శివకృష్ణ, గోపాల్,రాజు,శ్రీనునాయక్,గుండయ్య,కోటేష్, రమేష్, కిషన్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు శ్రీపతి రాజు, ఆవ గణేష్, హసన్ ఉన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై..

### ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి సమక్షంలో పలు పార్టీల నాయకుల చేరికలు



పార్టీలో చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 05 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా గడపగడపకు చేరడాన్ని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం తాడూర్ మండలం సిర్సవాడ, ఎటిధర్‌పల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ 76 సంవత్సరాల చరిత్రలో తెలంగాణలో ఎన్నడు అమలు కానీ సంక్షేమ పథకాలు అభివృద్ధి కేవలం 8 సంవత్సరాల్లోనే సీఎం కేసీఆర్ చేసి చూపించారన్నారు. పార్టీలో చేరిన వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. బీఆర్ఎస్ జాతీయ పార్టీగా త్వరలో జరగనున్న రాజకీయాల్లో కీలకమైన పాత్ర పోషించనుందని, ప్రధానిగా సీఎం కేసీఆర్‌ను ప్రజలు అకాంక్షిస్తున్నారన్నారు. దేశంలో 18 బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలోనైనా తెలంగాణ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. దేశంలో ప్రధాని మోడీ కులాలు, మతాల మధ్య విద్వేశాలను రెచ్చగొడుతూ ప్రజలను తప్పుద్రోవ పట్టిస్తున్నారని, ప్రజలు వారికి త్వరలోనే బుద్ధి చెప్పి తరిమివేయడం ఖాయమన్నారు. సిర్సవాడ, ఎటిధర్‌పల్లి గ్రామాల నుంచి పార్టీలో చేరిన వారు విష్ణు, హుస్సేన్, శ్రీశైలం, బాలరాజు, రమేష్, శ్రీనుగౌడ్, శ్రీశైలం, నరేష్‌గౌడ్, దస్తగిరి, మహేష , భీరయ్య, రాములు, భరత్‌తో పాటు పలువురు సభ్యులు చేరారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఇసాక్, నసీర్‌తో పాటు పలువురు సభ్యులు తదితరులు ఉన్నారు.

## ఎండాకాలం ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● పలుచోట్ల గతేడాది కన్నా రెండు డిగ్రీలు ఎక్కువ

● మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్



**వనపర్తి టౌన్,మార్చి 5 ప్రభాతవార్త:** నడివేసవి రాకముందే రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, ప్రస్తుతం కొన్ని జిల్లాలో రోజు నమోదు అవుతున్న ఉష్ణోగ్రతలు గతేడాదికంటే రెండు డిగ్రీలు ఎక్కువగా ఉన్నా యని మున్సిపల్ వైస్ చైర్మెన్ వాకిటి శ్రీధర్ జిల్లా ప్రజలకు తెలిపారు. మరికొన్ని జిల్లాలో ఒకటిన్నర నుంచి ఒక డిగ్రీ పైనే ఉంటున్నాయని అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గతేడాది 4వ తేదీన 37.3 డిగ్రీలు నమోదు కాగా శనివారం 40 డిగ్రీల సెల్సియస్ నమోదైందని అన్నారు. ములుగు జిల్లాలోనూ 40 డిగ్రీలు నమోదైంది. రాత్రిపూట కూడాసాధారణ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అన్నారు. నిజామాబాద్, మహబూబ్‌నగర్, భద్రాచాలంలో 21 డిగ్రీలఉ దాటాయని అన్నారు. ప్రస్తుతం ఎండలు దంచి కొడుతున్నాయని, ఈఎండలకు బయటకు వెళితే వడదెబ్బ లేదా స్ట్రోక్‌బారిన పడే అవకాశం ఎక్కువగా ఉన్నాయని ఇలాంటి పరిస్థితిలో మిమ్మల్ని మీరు ఆరోగ్యంగాఉంచుకోవాలంటే మాత్రంకొన్నిజాగ్రత్తలనుతప్పకుండా తీసుకోవాలనిఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారని ఆయన ప్రజలకు సూచించారు.

## ప్రతి గడపకు హత్ సే హత్ జోడో అభియాన్ పాదయాత్ర



హత్ సే హత్ జోడో అభియాన్ కార్యక్రమంలో నాగం జనార్ధన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 5 ప్రభాతవార్త:** ఏఐసీసీ మరియు పీసీసీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా హత్ సే హత్ జోడో అభియాన్ పాదయాత్రలో భాగంగా తిమ్మాజిపేట మండలం బుద్ద సముద్రం గ్రామంలో హత్ సే హత్ జోడో అభియాన్ పాదయాత్రను మాజీ మంత్రి వర్యులు నాగం జనార్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగం జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడు లేనటువంటి, ఎప్పుడు చూడని కనీ, విని ఎరుగని విధంగా రాహుల్‌గాంధీ చేపట్టినటువంటి భారత్ జోడో పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయేటటువంటి యాత్ర అని పేర్కొన్నారు. దేశంలో విభజించి పాలించే ఈ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరితో ప్రేమ, స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి జీవించి దేశ ప్రజలందరు ఏకతాటిపై నడవాలని రాహుల్‌గాంధీ పాదయాత్ర చేపట్టారన్నారు. భారత్ జోడో పాదయాత్ర యొక్క ఉద్దేశాన్ని ప్రజలకు తెలియజేసేలా హత్ సే హత్ జోడో అభియాన్ అని ప్రతి వీధికి, ప్రతి ఇంటికి, ప్రతి గడపకు తెలియజేసేలా కార్యక్రమాన్ని ప్రారంభించాలని మండల కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అంతకు ముందు గ్రామంలో అంబేద్కర్, వివేకానంద, చత్రపతి శివాజీ విగ్రహాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ జెండా విష్కరణ గావించారు.వివిధ పార్టీలకు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలోనాగం జనార్ధన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## అభివృద్ధి లక్ష్యంగా ఆత్మగౌరవం కాపాడుతూ ఆత్మవిశ్వాసం పెంపొందించింది తెలుగుదేశం



**వనపర్తి టౌన్,మార్చి 05 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలో 20, 21వ వార్డులో వార్డు ఇంచార్జీ గంధం చిన్న బాలయ్య, డి.బాలరాజు ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ముమ్మరంగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్ పాల్గొని గతంలో తెలుగుదేశం పార్టీ చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ మరోసారి తెలుగుదేశం పార్టీని ఆశీర్వదించాలని ఆయన కోరారు.యువత ఇష్టంతో సభ్యత్వం తీసుకొని రావుల నాయకత్వం కావాలని అడిగారు. ఫోన్ ద్వారా రావుల చంద్రశేఖర్ రెడ్డి నూతన సభ్యత్వం స్వీకరించిన వారికి శుభాకాంక్షలు తెలపారు. పార్టీ శ్రేణులకు ఇంటింటికి తెలుగుదేశం పార్టీ కార్యాచరణ గురించి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి గౌస్,ఏర్పుల రవి యాదవ్, ఖాదర్, రాజు, మేస్త్రీ అనిల్, ఫారుఖ్ పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ జి.చెన్నకిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు




పశువుల సంతలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న క్లబ్ సభ్యులు

**కల్వకుర్తి, మార్చి 5 ప్రభాతవార్త:** లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్, క్లబ్ పితామహులు, రైతు పక్షపాతి జి.చెన్నకిషన్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. రైతు పక్షపాతి అయిన జి.చెన్నకిషన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని పశువుల సంతలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షులు భైరి కరుణాకర్‌రెడ్డి ప్రారంభించారు. అదే విధంగా కల్వకుర్తిలోని లయన్స్ డయాగ్నో సెంటర్స్‌లో రోగులకు ఉచితంగా మధుమేహ పరీక్షలను నిర్వహించారు. కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని క్లబ్ అధ్యక్షులు భైరి కరుణాకర్‌రెడ్డి ప్రారంభించి మొక్కలు నాటారు. పశువుల సంతలో450 మంది రైతులకు అన్నదానం చేసినట్లు పీఆర్ఓ పాష తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కోశాధికారి కర్నాటి కొండల్‌రెడ్డి, జిల్లా చైర్మన్ బండెల రామచంద్రారెడ్డి, క్లబ్ సభ్యులు పి.వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించన సర్పంచ్



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ కవిత

**కోయిల్‌కొండ,మార్చి 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కానుగుబండ తండా గ్రామ పంచాయతీ పరిధిలో గల కళ్యాణ్‌నగర్ తండాలోని యాదవుల కాలనీలో ఆదివారం ఎన్ఆర్ఈజిఎస్ నిధులతో సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ కవిత ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాలకు సిసి రోడ్లు వేయడం జరిగిందన్నారు. మిగిలిపోయిన పనులను సైతం త్వరలోనే చేపడతామన్నారు. కానుగుబండ తండా గ్రామ పంచాయతీని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే నా ముందున్న లక్ష్యం అన్నారు. గ్రామ పంచాయతీలో అన్ని రకాల వసతులను సమకూర్చడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీతాబాయి. వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అలాగే కానుగుబండ తండా గ్రామ పంచాయతీలో కళ్యాణ్‌నగర్ తండా, గొల్లగిర దగ్గర ఎన్ఈజిఎస్ నిధుల నుండి సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ కవిత, ఉపసర్పంచ్ సీతాబాయి, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొని సిసి రోడ్డు పనులు ప్రారంభించారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**కల్వకుర్తి, మార్చి 05 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన కల్వకుర్తి మున్సిపల్‌లో డ్రైవర్‌గా పనిచేసే పగడాల పెద్దయ్య ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ పార్టీ నాయకులు బృంగి ఆనంద్‌కుమార్ పరామర్శించి రూ.4వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, కౌన్సిలర్లురాంరెడ్డి, గోరటి శ్రీనివాసులు, సతీష్, మాజీ కౌన్సిలర్ మబ్బు రామరాజు, నాయకులు పడకంటి వెంకటేష్, దున్న సురేష్, శివ తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ కార్మికుడి అకాల మృతి బాధకరం



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, మార్చి 05 ప్రభాతవార్త:** కల్వకుర్తి మున్సి పాలిటిలో సీనియర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కార్మికుడు పెద్దయ్య అకాల మృతి బాధకరమని మున్సిపల్ చైర్మెన్ ఎడ్మ సత్యం పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారు జామున మృతి చెందిన పెద్దయ్య కుటుంబాన్ని మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, వైస్ చైర్మన్ షాహేద్ లు పరామర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని మున్సిపల్ చైర్మెన్ ఎడ్మ సత్యం అందించి మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు.కార్యక్రమంలో ఎల్ఐసీ సత్యం, ఇంజమూరి రమేష్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్ పార్టీలోకి భారీగా చేరికలు



బిఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు

**మహ్మదాబాద్,మార్చి 5 ప్రభాతవార్త:** స్థానిక ఎమ్మెల్యే కొప్పుల మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నుంచి బిఆర్ఎస్ పార్టీలోకి మహ్మదాబాద్ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాటాడుతూ బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బిఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని ప్రతి పేదవాడికి బిఆర్ఎస్ పార్టీ పథకాలు అందాయని రాబోయే కాలంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, యాదయ్య,రాములు,అశోక్, శివ కుమార్, రాజు, కవి,సురెందర్,సుధాకర్,శివానంద,తిరుమలయ్య, రామకృష్ణ, విస్లావత్ రఘు, కాట్రావత్ రాజు, కొర్రకిషన్, కిషన్, శ్రీను, శ్రావణ్, పార్టీలోకి పార్టీ శ్రేణులు జడ్పీటిసి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి రాజ్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపిపి ఈశ్వరయ్యాగౌడ్, బిక్షపతి, గోపాల్‌రెడ్డి, నారాయణ, బెస్ట్ రాజు, సర్పంచ్‌లు,మాజీ ఎంపిటిసిలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చక్రపూర్‌లో వనభోజనాలు



వనభోజనాలు చేస్తున్న గ్రామస్తులు

**మూసాపేట,మార్చి5 ప్రభాతవార్త :** మూసాపేట మండల పరిధిలోని శక్రపూర్ గ్రామంలో ఆదివారం గ్రామస్తులు ఊరిబయట తమ పొలాల దగ్గరికి వెళ్లి వనభోజనాలు చేశారు. పిల్ల పాపలతో సంతోషంగా గడుపుతూ ఈ ఏడాది వర్షాలు బాగాపడి రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని గ్రామ దేవతకు మొక్కుకున్నారు. చెట్లకింద ఆటపాటలతో నృత్యాలతో సరదాగా కుటుంబ సభ్యులు అందరు ఒక దగ్గర కూర్చుని వనభోజనాలు చేశారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్



సిసి రోడ్డు పనులను ప్రారంభస్తున్న సర్పంచ్ రెడ్యానాయక్

**కోయిల్‌కొండ,మార్చి5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని గంగానాయక్ తండా గ్రామ పంచాయతీలో ఆదివారం ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ రెడ్యానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన గంగానాయక్ తండా గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు తనవంతు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సహకారంతో గ్రామానికి అధిక నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. గ్రామ పంచాయతీలోని అన్ని వార్డులలో సిసి రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రవినాయక్ పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ధర్మపదం కార్యక్రమంలో మక్తల్ విద్యార్థినిల ప్రతిభ



**మక్తల్,మార్చి 5 ప్రభాతవార్త:** ఆధ్యాత్మికత అంద్య నృత్యాలయ వారిచేత విశాఖపట్నం ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ వారు నిర్వహించిన నృత్య పోటీలలో మక్తల్ విద్యార్థినిలు సాయి సప్తశ్రీ, వేదశ్విని, ప్రసన్న ముగ్గురు విద్యార్థులు తమ నృత్యంతో అక్కడ ఉండే ప్రజలతో ప్రదర్శనలో వైభవంగా సంతోషంగా కేరింతల మధ్య తమ ప్రదర్శనను ఇచ్చారని నాట్యాల గురువైన జోషి హారతి గోపాలాచార్య సంతోషం వ్యక్తం చేశారు. ఎంతో అద్భుతంగా భరతనాట్యం ప్రదర్శించిన వారు అక్కడి దేవాదాయ శాఖవారు వీరికి మెమెంటో లతో సత్కరించడం జరిగిందని వారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు వరం సంపూర్ణ తెలంగాణ ఆరోగ్య పథకం



**మక్తల్,మార్చి 05 ప్రభాతవార్త:** ఈ నెల 8 నుండి ఆరోగ్య మహిళా పథకం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో అధికార ప్రతినిధి రామలింగం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 8 నుంచి ఆరోగ్య మహిళా పథకం ప్రారంభించడం జరుగుతుందని తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. దేశంలోనే నంబర్ వన్ స్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని కేంద్రమే ఎన్నోసార్లు నివేదికలు ఇచ్చి ప్రశంసించిందన్నారు. మహి ళా దినోత్సవం సందర్భంగా తెలంగాణరాష్ట్రంలో ఆరోగ్య మహిళా పథకం ప్రారంభమవుతుందని అన్నారు. సంక్షేమం, విద్య,వైద్యం ఇలాఅనేక అంశాలలో ఎన్నో పథకాలు రాష్ట్ర ప్రజలకు అందిస్తూ రాష్ట్ర ప్రజల దీవె నతో కెసిఆర్ ప్రభుత్వం సాగుతుందని అన్నారు. దేశంలో ఉన్న ప్రజలంతా సుభిక్షంగా,సంతోషంగా ఉండాలంటే కేంద్రంలో భారత రాష్ట్ర సమితి అధికారంలోకి రావాలని అన్నారు. బిజెపికి ప్రత్యామ్నాయంగా బలపడే శక్తి కెసిఆర్‌కు మాత్రమే ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రా నిక్ మీడియా కన్వీనర్‌రెడ్డి ఈశ్వర్ యాదవ్‌లు ఉన్నారు.

## దేవరకద్ర విద్యార్థుల విజ్ఞాన విహారయాత్ర

**దేవరకద్ర,మార్చి 05 ప్రభాతవార్త:** దేవరకద్రలోని సివిరామన్ ప్రవేటుపాఠశాల విద్యార్థులు ఆదివారం విజ్ఞానవిహారయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు హైద్రాబాద్‌లోని ఎస్‌కే పార్కుకు తీసుకెళ్లారు. అక్కడ విద్యార్థులు రోజంతా ఉండి సరదాగా గడిపారు. వనభోజనాలు చేశారు. అలాగే అక్కడ పలు విషయాలను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 40 మంది విద్యార్థులు ఈ యాత్ర లో పాల్గొన్నారు.



## అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**నవాబ్‌పేట,మార్చి 5 ప్రభాతవార్త:** నవాబ్‌పేట మండలంలోని ఇప్పటూర్ గ్రామానికి చెందిన అంగన్‌వాడి ఆయా (హెల్పర్) బుడిద మణెమ్మ హఠాత్తుగా మరణించింది. వారి మృతికి సంతాపం తెలిపిన ఇప్పటూరు ఉపసర్పంచ్ దుబ్బ రవికిరణ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట ఇప్పటూరు రైతుబంధు కోఆర్డినేటర్ అబ్దుల్ ఖాదర్, ఎస్ఎంసి వైస్ చైర్మన్ మహేష్, సన్నీళ్ల లక్ష్మినారాయ, రాజు, కమ్మరి శేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటివాస్తుపూజలో నేతలు

**దేవరకద్ర,మార్చి 05 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం డోకూర్‌లో ఆదివారం జరిగిన పడమటి శ్రీకాంత్‌రెడ్డి ఇంటివాస్తుపూజలో దేవరకద్ర నేతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జెట్టి నరసింహ్మారెడ్డి,దేవరకద్ర పట్టణ పార్టీ అధ్యక్షుడు మున్నూరు బాల్‌రాజ్, మార్కెట్ చైర్మెన్ విజయవెంకటేశ్,సింగిల్‌విండో చైర్మెన్ నరేందర్‌రెడ్డి, నాయకులు కొండశ్రీనివాస్‌రెడ్డి, ఉప్పరిసత్యం, సయ్యద్‌గౌస్,కొండ భాస్కర్‌రెడ్డి,బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా సీఈఓ సెట్ పరీక్ష



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

**కొత్తకోట,మార్చి 05 ప్రభాతవార్త:** పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర గురుకుల పాఠశాలలో నిర్వహించిన సీఈఓ,యూజీ సెట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ మాలతి,శ్రీనివాసులు తెలిపారు. బాలికల గురుకుల పాఠశాలలో సీఈఓ సెట్ మొత్తం 203ంది విద్యార్థులకు గాను 192మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే యూజీ సెట్ పరీక్షలో 233మంది విద్యార్థులకుగాను 215మంది విద్యార్థులుహాజర య్యారు.అలాగే సాంఘీక సంక్షేమబాలు పాఠశాలలోసీఈఓ సెట్ పరీక్షకు 166 మంది విద్యార్థులకుగాను 162 విద్యార్థులు హాజరయ్యారు.హాజరయ్యే విద్యార్థులను సిబ్బంది క్షున్నంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రానికి అనుమ తించారు.

## నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలోయువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

**వనపర్తి టౌన్,మార్చి 05 ప్రభాతవార్త:** రక్తనిధి కేంద్రంలో రక్త నిలువలు సజావుగా లేవని రెడ్ క్రాస్ తెలిసిన వెంటనే నిస్వార్థ ఆర్గనైజేషన్ సభ్యులు, యువత ముందుకొచ్చి ఆదివారం స్వావలంబనగా రక్తదానం చేయడం జరిగిందని జిల్లా రెడ్ క్రాస్‌పాలకవర్గ సభ్యులు వారిని అభినందించారు. రక్తనిలువలు లేని సమయంలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం హర్షించదగ్గ విశేషమని, వీరిని స్ఫూర్తిగా తీసుకోని అర్హులైన యువతి, యువకులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేసి రక్తం అవసరం ఉన్న వారిని ఆదుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అరవింద్, పి.సంతోష్,ఎం.రవి,బి.మల్లేష్,ఓ.లోకేష్,సాంకేతిక నిపుణులు శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూసాపేట గ్రామ సగర సంఘం అధ్యక్షుడిగా బీసం రాఘవులు ఎన్నిక



**మూసాపేట,మార్చి 05 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ఆదివారం మూసాపేట గ్రామ సగర సంఘం అధ్యక్షుడిగా బీసం రాఘవులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు వైస్ ప్రెసిడెర్‌గా కెఆర్ లోకేందర్, సెక్రటరీగాకొండల్, జనరల్ సెక్రెటరీగా గోవిందసాగర్, కోశాధికారిగా డిఆర్ వెంకటేశ్వర్లు, సలహా దారులుగా ఆస్కాని ఆంజనేయులు, కెఆర్ బాలరాజు, గుంటి కృష్ణయ్య, గిన్ని కృష్ణయ్య, ఆస్కాని నరసింహులు, సగర సంఘం నాయకులు ఎన్నుకున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి పరామర్శ

**వెల్దండ,మార్చి 05 ప్రభాతవార్త :** మండల పరిధిలోని భైరాపూర్ గ్రామానికి చెందిన మాల చిన్నవెంకటయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి వెల్దండ యెన్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకయ్యను ఆదివారం భైరాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు తిరుగుడు రాజు యాదవ్‌ను పరామర్శించి ఆసుపత్రి ఖర్చులకు గాను రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి వెంకటయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

## కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రజా పోరాటాలు నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్

**తెల్కపల్లి,మార్చి 05 ప్రభాతవార్త:**కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై ప్రజా పోరాటాన్ని నిర్వహిస్తామని నాగర్ కర్నూల్ జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. శ్రీనివాస్ అన్నారు. ఆదివారం సిపిఎం తెల్కపల్లి మండల కమిటి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ఎండగడుతూ ఈనెల 23 నుండి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు జాతాలు నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు మోపుతూ పెట్రోల్,డీజిల్,వంటగ్యాస్ ధరలు నిరంతరం పెంచుతున్నదని అన్నారు. ఈ విధానాలపై సిపిఎం పార్టీ నిరంతర పోరాటం నిర్వహిస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు భాస్కర్, విజయ్‌గౌడ్, జగదీష్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి

**వనపర్తి క్రైమ్,మార్చి 05 ప్రభాతవార్త:** శనివారం రేవల్లి మండలం నాగాపూర్ గ్రామానికి చెందిన బూత్ ఎంరోలర్ నరేష్ కుమారుడు రేవల్లి గ్రామం సమీపంలో ఒక బ్లాస్టింగ్ లో ప్రమాదవశాత్తు మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మెన్ డా.జి.చిన్నారెడ్డి బాదిత కుటుంబాన్ని పరామర్శించి జరిగిన ప్రమాదానికి చలించి వారికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం రేవల్లి పోలీస్ స్టేషన్ కు వెళ్లి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ప్రమాదానికి కారకులైన వారిని తప్పకుండా శిక్షించాలని స్థానిక ఎస్ఐ ని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్, రేవల్లి మండల అధ్యక్షులు పర్వతాలు, ఎంపీటీసీ అంజనమ్మ రాములు, రేవల్లి మండల బీసీ సెల్ అధ్యక్షులు తిరుపతయ్య, గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరహరి,మండల కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జిల్లెల ప్రవీణ్ కుమార్‌రెడ్డి,వనపర్తి పట్టణ ఓబీసీ సెల్ అధ్యక్షులు బొంబాయి మణ్యంకొండ, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు రోహిత్, చిన్నంబావి మండల అధ్యక్షుడుచంద్రశేఖర్, వెంకటయ్య, నరసింహా, నిరంజన్, కేశవ ఉన్నారు.



బాధితుడు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి

# మనిషి జీవితం రంగులమయం ప్రకృతి ఇచ్చే సంకేతం

- వికసించే పుష్పాలతో వసంత రుతువు ఆగమనం
- మోదుగచెట్టు త్యాగం సర్వం మానవ ఉపయోగార్థమే
- బసంతపూల కేళి హోలి రంగోలి

**గండీడ్,మార్చి 5 ప్రభాతవార్త:** కుల,మత, లింగ, వయోభేదాలు లేకుండా పేద, ధనిక, మధ్య తరగతి అనే బేదభావం లేకుండా ప్రజలంతా ఆనందోత్సాహలతో జరుపుకునే పండుగ హోలి. చిగురించే ఆకులు, వికసించే పుష్పాలతో వసంత ఋతువు ఆగమనంతో ప్రకృతి అంతా రంగు రంగుల పూలతో నయనానందకరంగా ఉంటుంది. మనిషి జీవితం కూడా కష్ట సుఖాల కలబోత అని, మనిషి జీవితం రంగులమయం కావాలని ప్రకృతి ఇచ్చే సంకేతంగా దీన్ని చెప్పుకోవచ్చు. హోలీ అనగా అగ్ని అని, అగ్నితో పునీతమైంది అని అర్థం.హోలీనే కాముని పున్నం, డోలికోత్సవం, రంగుల పండుగ, వసంత ఋతువుకు స్వాగతం పలుకుతూ చేసుకునే పండుగ కాబట్టి దీనిని వసంతోత్సవం అని కూడా అంటారు. ప్రతి సంవత్సరం ఫాల్గుణ మాసంలో పౌర్ణమి రోజున ఈ పండుగ జరుపుకుంటాం. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో బసంతపూలను హోలికి ఉపయోగిస్తారు. దీనివల్ల చర్మవ్యాధులు నయమవుతాయి. అంతేకాదు ఆరోగ్యానికి శ్రేయస్కరం కూడా. బసంతపూలను ఉడకబెట్టి వాటి రసాన్ని హోలీలో చల్లుకునే నీళ్లలో ఉపయోగిస్తారు. ఇప్పటికి చాలామంది బసంతపూలతో హోలీరంగులను సిద్ధం చేస్తారు.

**పురాణ కథలు...**

దక్షయజ్ఞం సమయంలో అగ్నికి ఆహుతి అయిన సతీదేవి వినియోగాన్ని భరించలేకపోయిన పరమేశ్వరుడు హిమాలయాలలో తపో దీక్షలో ఉండగా మన్మథుడు పూలబాణం వేసి దీక్షను భగ్నం చేశాడు. ఆగ్ర హించిన శివుడు మూడోకన్ను తెరిచి (కాముడు) మన్మథుడిని భస్మం చేశాడు. రతీదేవి కోరిక మేరకు మన్మథుడిని బ్రతికించి, ఎవరికి కనపడ కుండా కేవలం రతీదేవికి మాత్రమే కనిపించేలా వరమిస్తాడు. కామ దహనం చేసిన తర్వాత రోజు హోలిని జరుపుకుంటున్నాం. మరో కథనం ప్రకారం శ్రీకృష్ణునిరాధ నల్లవాడని హేళన చేయగా, తనను ఏడిపించడా నికి సరదాగా రంగులు పూస్తూ గోపికలతో పాటు రంగుల పండగ జరుపు కున్నట్లు తెలుస్తున్నది.

**మరో కథనం ప్రకారం...**

ప్రహ్లాదుడు హోలిక దహనం వలన హోలిక దహనానికి గుర్తుగా మనము హోలీ పండగను జరుపుకుంటున్నాం. మన లో మన చెడును దహనం



మోదుగపువ్వు

చేసి నిర్మల, స్వచ్ఛ మనసుతో ఎదుటివారికి ప్రేమను పంచడం, వారితో సంతోషాలు పంచుకోవడం అన్నది ఇందులోని పరమార్థం. హోలీ పండగకు సంబంధించి హాలుని గాథా సప్తశతిలో ఫాల్గుణ ఉత్సవం,మదనోత్సవం అనిదండి దశకుమారచరిత్రలో వసంతోత్సవ అనే పేర్లు, వాటికి సంబంధించిన వర్ణన మనకు కనిపిస్తుంది.

**మోదుగ పూలు...**

బసంత పూలని మోదుగ అని పిలుస్తారు. ఇదీ ఒక ఎర్రని పూవు. ఈ పువ్వులను అగ్నిపూలు అని పిలుస్తారు. గుత్తులుగా పూస్తాయి. ఇది ఫాబేసి కుటుంబంలో బుటియా ప్రజాతికి చెందిన పుష్పించే మొక్క. దీని శాస్త్రీయ నామం బుటియా మోనాస్పెర్మా. ఇది ఒక పెద్ద చెట్టులాగా పెరుగుతుంది. అందమైన ఎర్రని పూలు గుత్తులు గుత్తులుగా పూస్తాయి. చాలా అందంగా ఉంటాయి. మోదుగ చెట్టును కింశుక వృక్షము అని కూడా అంటారు. అంతేకాక భారతీయ భాషల్లో దీనిపేర్లు ఇలా ఉన్నాయి. సంస్కృతంలో పలాశ అని, హిందీలో పలశ్ అని, తెలుగులో మోదుగ, మోదుగు అని మలయాళంలో మురికు, శమత, బ్రీమవృక్షం అని, తమిళంలో పొరొసం, కత్తుమురుక అని, కన్నడంలో ముథుగ, బ్రహవృక్ష అని, పంజాబ్, హర్యానాల్లో కాకాక్ అని, ఒరియాలో కింజుకొ, పొరసు అని అంటారు.అంటే, ఇన్ని భాషల్లో ఇన్ని పేర్లున్న ఈ మోదుగ దేశ వ్యాప్తంగా ఉన్నట్లు ఋజువవుతున్నది కదా!.

మోదుగ ఎత్తుగా పైకి పెరిగే వృక్షం. ఈ చెట్టు దాదాపు 15 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. పెరుగుదల నిదానం. నారింజరంగుతో, ఎర్రని గుత్తుల ఈ పూలు కనువిందుచేస్తాయి. చాలా తమాషాగా ఉంటాయి. కొక్కెలలాగా, కొద్దిగా చిలుకముక్కుల్లాగా ఉంటాయి పూలు. ఆకులే కనిపించనట్లు నిండుగా పూస్తాయి. మృదువైన కేశరాలతో ఉంటాయి. ఈ మోదుగ పూలేకాక చెట్టు కూడా ఎంతగానో ఉపయోగపడి తన త్యాగ గుణాన్ని చాటుకుంటుంది. వేసవి ప్రారంభానికి చెట్లు ఆరంజి రంగులో నిండుగా పూలతో కళకళలాడుతూ సూర్యుణ్ణి ఆహ్వానిస్తాయి. ఈ పూల పుప్పొడి నుంచి అబిర్ అనే, హోలి రంగుల్లో కలిపే రంగును తయారు చేస్తారు. పూలమొగ్గలు ముదురు బ్రౌన్ రంగులో ఉండి, చెట్టుపైన పూలు బాగా పూసి ఎర్రగా అగ్నిశిఖలాగా ఉండడం వల్ల వీటిని అగ్నిపూలు అని అంటారు.కాయలను, వైద్యంలో వాడుతారు. చాలా ఔషధ గుణాలున్నాయి. మోదుగనూనె, ఆకులు, విత్తనాలు కూడా ఆయుర్వేదంలో అనేక ఔషధాలుగా ఉపయోగిస్తారు. మోదుగ ఆకులను, కాడలను, కొమ్మలను కూడా, మోదుగ పువ్వులను హిందువుల పూజల్లో ఉపయోగిస్తాం. ఇంటిలో చెడు పోగొట్టను ఎండిన మోదుగ కొమ్మలను విరిచి కాలుస్తారు. వాటి ద్వారా వచ్చే పొగ ఇంట్లో ఉండే చెడును హరిస్తుందని నమ్మకం. ఈ పువ్వులు ఒక రకమైన సువాసనతో పాటు అందంగా ఉంటాయి. నిండు ఆరంజి రంగులోని ఈ పువ్వులను చూస్తే మనసుకు ఎంతో ఆనందం కలుగుతుంది. ఈ పువ్వులు పరమశివుడికి అత్యంత ఇష్టం. లక్క పురుగులు దీనికి అతిథులు. ఈ మోదుగ చెట్టు కలపను ప్యాకింగ్ పెట్టెల తయారీకి వాడుతారు. తుపాకీమందుకు ఈ కర్రబొగ్గు ఉపయోగపడుతుంది. ఈ చెట్టుబంక టానింగ్, రంగుల అద్దకంలోనూ వాడుతారు. కాండం యొక్క బెరడును కూడా పరిశ్రమలో ఉపయోగిస్తారు.బెరడు నుండి నార తీస్తారు. చూశారా చెట్టు త్యాగం సర్వం మానవ ఉపయోగార్థమే. సాధారణంగా యజ్ఞాలు, యాగాలు జరిగే చోట మోదగచెట్టును హోమద్రవ్యంగా వాడతారు. మోదుగలో ఔషధగుణం నెయ్యిలో మండలం వల్ల ద్విగు ణీకృతం చెంది యాగాలలో వెలువడే పొగ పీల్చడం వల్ల అనేక జబ్బులు నయమవుతాయి. ఈ మోదుగ చెట్టు బెరడు కారం, చేదు, వగరు రుచులు కలిగి ఉంటుంది.దీన్ని ఔషధంగా తీసుకోవడం వల్ల ప్లీహ రోగాలు, శ్లేష్మ రోగాలు, మూలవ్యాధులు నయమవుతాయి.

### కందూరు రామలింగేశ్వర ఆలయంలో

# నేడు రుద్రాభిషేకం రుద్ర హోమం

◆ఆలయంలో పెరిగిన 27 కల్పవృక్షాలు

**అడ్డాకుల,మార్చి 05 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కందూరు గ్రామ శివారులో ప్రకృతి ఒడిలో వెలసిన శ్రీరామలింగేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. కల్ప వృక్షాలకు నిలయమైన కాశీ తరువాత దక్షిణ కాశీగా పేరుగాంచిన అతి పురాతమైన దేవాలయం శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం బ్రహ్మోత్సవాలు రాష్ట్ర నలమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. కాశీలో వెలసిన కల్ప వృక్షాలు కందూరు రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఉండడం భక్తులకు ప్రత్యేకత ఆలయం వద్ద సహజసిద్ధంగా పెరిగిన 27కల్పవృక్షాలు 27నక్షత్రాలకు ప్రతికూలంగా భక్తులు భావిస్తారు. ఈ చెట్ల కింద భక్తితో నైవేద్యం వండి స్వామివారికి సమర్పిస్తారు. కాశీ తరువాత మహిమగల ఆలయం క్షరామలింగేశ్వర ఆలయం దర్శించుకుంటే కాశీకి వెళ్లివచ్చినంత భక్తులు భావిస్తారు. జాతర బ్రహ్మోత్సవాలకు ముందు బూత బలి, మహాశాలి ప్రవేశం, విగ్నేశ్వర పూజ, త్రిశూల పూజ, అగ్నిప్రతిష్ట 5వ తేదీన శివ పార్వతి రామలింగేశ్వర స్వామి కళ్యాణోత్సవం, 6వ తేదీన మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం రుద్ర హోమం, రాత్రి స్వామి వారికి బ్రహ్మోత్సవాలంకరణ, 7వ తేదీన నిత్యపాసన రాత్రికి రతవగా హోమం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం, 8వ తేదీన బలి



శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ కోనేరు

హరణ రాత్రి వృషభవాస్యసేవ, 9వతేదీన మహాపూర్ణావతి త్రిశూల స్థానం తీరుతావలి తీర్థప్రసాదాల వితరణ నిర్వహిస్తారు. తీర్థవళితో స్వామివారి బ్రహ్మోత్సవాలుముగుస్తాయి. జాతర ఉత్సవాలు శ్రీరామ నవమి వరకు కొనసాగుతాయి,నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరామలింగేశ్వర స్వామి వారి క్షేత్రంలో జరిపే ఉత్సవాలకు కైంకర దాతలుగా లేక భక్తులుగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయం



ఆలయంలో సహజంగా పెరిగిన కల్పవృక్షాలు

## బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతాం..!

- ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లిలో లక్షలాది మందితో ప్రదర్శన ర్యాలీ
- సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మీ



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మీ

**వనపర్తి టౌన్,మార్చి 05 ప్రభాతవార్త:** సీఐటీయు తెలంగాణ రైతు సంఘం, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయు వనపర్తి ఆఫీస్ ఆవరణలో ఆదివారం కార్మిక కర్షక మైత్రి సదస్సు డి.బాల్‌రెడ్డి, ఎం.రాజు, ఎస్.రాజు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సదస్సుకు సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మీ హాజరై మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలంతా కూడా ప్రైవేటు పరం చేయడం ఎక్కువమొగ్గు చూపడం, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం మూలంగా ప్రజాధనంతో నిర్మితమైన ప్రభుత్వ సంస్థలు, నేడు కార్పొరేట్ సంస్థలకు ఆదాయాన్ని ఇచ్చే విధంగా ఉన్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించడం మూలంగా ఉద్యోగుల తొలగింపులు చేయడం, కనీస వేతనాలు అమలుచేయకపోవడం, ఔట్‌సోర్సింగ్ , కాంట్రాక్ట్ బేస్ ల కింద అతితక్కువ వేతనాలను అమలు చేయించుకుంటూ ఉందని అన్నారు. అదేవిధంగా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం తెస్తామని నాడు రైతు సంఘాలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కి కార్పొరేట్ సంస్థలకు భూములను అప్పజెప్పడానికి కుటిల ప్రయత్నాలు చేస్తాఉందని అన్నారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇటీవల గ్యాస్ సిలిండర్ల ధరలను పెంచి పేదల నిడ్డివిరించదని ఆమె తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలను నిరంతరం పెంచుకుంటే ప్రజలపై భారాలు పెంచుతుందని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు ప్రజల సొత్తును అప్పనంగా కేంద్ర ప్రభుత్వం పాలన కొనసాగుతోందని ఎద్దేవ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులను తగ్గించి వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా చేసిందని అన్నారు. ఇప్పటికే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింత పని చేస్తున్న వాచర్లకు మూడు నెలల వేతనాలను ఇవ్వలేదని అన్నారు. ఉపాధి హామీని పూర్తి నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతుందని అన్నారు. కాబట్టి కార్మిక రైతు వ్యవసాయ కార్మికుల చేత ఏప్రిల్ 5వ తేదీన లక్షలాది మందితో డిల్లోలో గొప్ప ప్రదర్శన ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ ర్యాలీకి కార్మిక, కర్షకులు వేలాది మంది పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలను వెనక్కి తీసుకొనుటకు ప్రజలందరు సమైక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లాలోని అన్ని మండలాల్లో, గ్రామాల్లో ఇంటింటికి తిరిగి బీజేపీ పార్టీ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ బీజేపీ ప్రభుత్వ కుటిల యత్నాలను బయటపెట్టాలని కోరారు. ఈ సదస్సులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వ చారి, సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్, ఎం.వెంకటయ్య, మద్దిలేటి, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా వార్ల వెంకటయ్య



మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షున్ని సన్మానిస్తున్న దృశ్యం

**కోయిల్‌కొండ,మార్చి 05 ప్రభాతవార్త :** మండల ముదిరాజ్ సంఘం నూతన అధ్యక్షులుగా మండలంలోని సూరారం గ్రామానికి చెందిన వార్ల వెంకటయ్యను ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రమైన కోయిల్‌కొండలో ఆదివారం మండల ముదిరాజ్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని ముదిరాజ్‌లందరు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులుగా వార్ల వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతన మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు వార్ల వెంకటయ్య మాట్లాడుతూ మండలంలోని ముదిరాజ్ సంఘ సభ్యులను అందరిని కలుపుకుని వారి సమస్యల సాధన కొరకు పోరాడుతానని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. రాజకీయ, సామాజిక అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగుతానని ఆయన ఈ సందర్భంగా అన్నారు. మండలంలోని ముదిరాజ్‌లకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఆయన పేర్కొన్నారు. ముదిరాజ్‌లందరు ఐక్యంగా ఉండి ముందుకు సాగాలన్నారు. మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులుగా వీరారం వెంకట్రాములును ఎన్నుకున్నారు. వీరితోపాటు మరో 20 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోపాల్, సి. నారాయణ, పి. మొగులయ్య, మడుగు వెంకటయ్య, టి. వేణుగోపాల్, వీర్న, కొండయ్య, కనకయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమాలను ప్రజలకు చేరువచేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న క్లస్టర్ ఇంఛార్జి జి. మాధవరెడ్డి

**తెల్కపల్లి,మార్చి 05 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేసి నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి చేస్తున్న నియోజకవర్గ అభివృద్ధిని తెలియజేయాలని సర్పంచ్ సుగుణబాబుగౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గట్టునెల్లికుదురు గ్రామంలో సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా పాల్గొని వారు మాట్లాడుతూ మర్రి జనార్ధన్‌రెడ్డి సహకారంతో గ్రామాలకు సంక్షేమ పథకాలు అందుతూ గ్రామాలలో మౌలిక వసతుల కొరత తీరుతున్నదని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుగుణ బాబు గౌడ్‌తో పాటు రైతుబంధు మండల అధ్యక్షులు క్లస్టర్ ఇంఛార్జి జి. మాధవరెడ్డి, సోషల్ మీడియా ఇంఛార్జి పర్వతాలు, లక్నారం బాలు, బి. సత్యనారాయణ, ఉపసర్పంచ్ తిరుపతయ్య, టిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు చంద్రారెడ్డి, సురేష్, చందు, నాయకులు కాశన్న,శ్రీను, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర



హాత్ సే హాత్ జోడో కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

**గద్వాల ప్రతినిధి,మార్చి 05 ప్రభాతవార్త:** హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర 16వ రోజు యాత్ర ఆదివారం కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మన భారత రాజ్యాంగం మానవులందరికి సమాన హక్కులను ఇచ్చిందన్నారు. టిఆర్ఎస్, బిజెపి పార్టీలు మానవులను వేర్వేరు కులాలు, మతాలుగా విభజించారని దీనిపై తగిన చర్యలను కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి మతాలు, కులాల మధ్య విభేదాలు సృష్టించి విద్వేషాలు పెంచుతున్నారన్నారు. అందరు కలిసి మెలిసి మానవత్వంగా జీవించాలనేదే ఈ యాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి ఆడబిడ్డకు రూ.500ల గ్యాస్ ఇస్తామని, రైతులకు రెండులక్షల రుణమాఫీ చేస్తుందని, ఎవరైనా పేదలు ఇల్లు కట్టుకోవాలంటే వారికి చిన్నజాగా ఉన్నా ఐదు లక్షలు ఇచ్చి ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బల్గెర నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరబాబు, గద్వాల మండలఅధ్యక్షులు పూడూరు రఘునాయుడు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు కిఫాయత్, విజయకుమార్, కృష్ణ, రమేష్, రాజు, వీరేష్,మొయిన్, చేనుగొనిపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు విద్యుత్ మెరుగులు పడి గడ్డివాము దగ్ధం



**వెల్దండ,మార్చి 05 ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా అయ్యే వైర్ల నుండి మెరుగులు పడి మూడు ట్రాక్టర్ల గడ్డివాములు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని పోతేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన బోయిన్‌పల్లి, నిరంజన్‌గౌడ్ అనే రైతు తన పశువులకు సుమారు 50 వేల విలువ చేసే మూడు ట్రాక్టర్ల గడ్డివాములు కరెంటు వైర్ల నుండి పడిన నిప్పుల రవ్వల వల్ల తన వ్యవసాయ పొలం వద్ద ఉంచిన గడ్డి వాములకు నిప్పంటుకుందని ఇటీవలే గడ్డి కొనుగోలు చేసినట్లు తెలిపారు. పశువుల పశు గ్రాసానికై ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ట్రాక్టర్ బోల్తా : తృటిలో తప్పిన ప్రమాదం

**అయిజ,మార్చి 05 ప్రభాతవార్త:** మండల పరిధిలోని బైనిపల్లి గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో ప్రమాదం నుండి గ్రామానికి చెందిన డ్రైవర్ రెహమానన తృటిలో బయటపడ్డ సంఘటన ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోకి ట్రాక్టర్‌లతో మట్టి తోలుతుండగా ఎదురుగా వస్తున్న మరో ట్రాక్టర్‌కు సైడ్ ఇవ్వబోయి అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడిందని తెలిపారు. అయితే ట్రాక్టర్ ట్రాలీతో సహా బోల్తాపడడంతో డ్రైవర్ రెహమాన్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రమాదం నుంచి స్వల్ప గాయాలతో బయటపడ్డాడని అన్నారు.



ట్రాక్టర్ బోల్తా పడిన దృశ్యం